# తల్లిదండ్రుల చెంతకు విద్యార్థుల ప్రోగ్రెస్

సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విద్యారంగంలో తీసుకొచ్చిన సంస్కరణలు, విప్లవాత్మక మార్పులు మంచి సత్ఫలితాలను ఇస్తోంది. ఇందులో భాగంగా పాఠశాలల వారీగా విద్యార్థుల ప్రగతి పత్రాలను నేరుగా తల్లిదండ్రులకు పంపించే విధానాన్ని అమలులోకి తెచ్చి విద్యాశాఖ విజయవంతంగా అమలు చేస్తోంది.

- పేరెంట్స్ సెల్‌ఫోన్‌కు ఎస్‌ఎంఎస్ రూపంలో సమాచారం
- ఓటీపీ ద్వారా సెక్యూర్‌గా..


School Information Management System
Department of School Education, Government of Andhra Pradesh
Holistic Progress Card (2023-24)

| | |
|---|---|
| Name of the Student: HALIMA SAADIYASYED | Admission No: 00490 |
| Father's Name: SA SYED BASHA | Year: 2022 |
| Phone No: - | Exam No: - |
| Mother's Name: | D.O.B: 2017-02-04 |
| Phone No: - | Class: 2 |
| Address: D.No. - | Section: 1 |
| Street: - | Medium: Urdu |
| Village: - | Height: - |
| District: SPS Nellore | Weight: - |
| Pincode: 524222 | Moles: 1.- 2.- |
| Mobile No: XXXXXX6648 | Caste: OC |
| | Aadhar No: XXXXXXXX2804 |
| | Blood Group: - |

హోలిస్టిక్ కార్డులో పొందు పరిచిన వివరాలు


పరీక్షలు రాస్తున్న విద్యార్థులు (ఫైల్)


దుత్తలూరు : పాఠశాలల్లో విద్యార్థుల ప్రగతికి సంబంధించిన పత్రాలను పాఠశాల విద్యాశాఖ నేరుగా తల్లిదండ్రులకు చేరవేస్తోంది. ఉదయగిరి నియోజకవర్గంలోని అన్ని పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థుల వారీగా 2023–24 విద్యాసంవత్సరానికి నమోదైన హాజరు, పరీక్షల్లో వచ్చిన మార్కుల వివరాలతో తల్లిదండ్రుల సెల్‌ఫోన్ నంబర్లకు ఎస్‌ఎంఎస్ రూపంలో సమాచారం చేరవేస్తోంది. గత ఏప్రిల్ నెలలో వేసవి సెలవులు ఇచ్చిన రోజునే తల్లిదండ్రులను పాఠశాలలకు పిలిచి విద్యార్థుల ప్రోగ్రెస్ గురించి వివరించారు.

**కార్డులో పొందుపరిచే సమాచారం**

గత విద్యాసంవత్సరంలో ఆయా పాఠశాలల్లో 1 నుంచి 10వ తరగతి వరకు చదివిన విద్యార్థుల ఇంటిపేరుతో సహా పూర్తి పేరు, తల్లిదండ్రుల పేర్లు, అడ్మిషన్ నంబర్, మొదటిసారిగా పాఠశాలలో చేరిన సంవత్సరం, పుట్టిన తేదీ, ఊరు, పిన్ కోడ్ వివరాలతో పాటు ఆధార్‌కార్డులోని చివరి నాలుగు అంకెల ఫార్మటివ్ అసెస్మెంట్, సమ్మెటివ్ అసెస్మెంట్‌ల వారీగా పొందిన మార్కులు, గతేడాది జూన్‌లో పాఠశాలలు పునఃప్రారంభమైన తేదీ మొదలు ఏప్రిల్‌లో చివరి పనిదినం వరకు పాఠశాల జరిగిన రోజులు, విద్యార్థి హాజరైన రోజులను పొందుపరిచారు. ఇదే కాలంలో మొత్తం హాజరు వందశాతానికి గానూ విద్యార్థి హాజరైన శాతాన్ని పొందుపరిచారు.

**ప్రోగ్రెస్ కార్డు పొందడం ఇలా..**

రాష్ట్ర పాఠశాల విద్యాశాఖ కార్యాలయంలోని స్కూల్ ఇన్‌ఫర్మేషన్ మేనేజ్‌మెంట్ సిస్టం ద్వారా విద్యార్థుల తల్లిదండ్రులకు ఎస్‌ఎంఎస్‌లు వెళ్తాయి. ఇందులో విద్యార్థి ప్రగతికి సంబంధించి హోలిస్టిక్ ప్రోగ్రెస్ కార్డు వివరాలను లింకులో పొందుపరుస్తారు. లింక్‌పై క్లిక్ చేసిన తర్వాత స్క్రీన్‌పై కనిపించే అక్షరాలను అక్కడ ఇచ్చిన స్పేస్‌లో టైప్ చేయగానే పాఠశాలలో ఇచ్చిన రిజిస్టర్డ్ మొబైల్ నంబర్‌కు ఆరు అంకెల ఓటీపీ వస్తుంది. దీనిని ఎంటర్ చేసిన తర్వాత హోలిస్టిక్ ప్రోగ్రెస్ కార్డు ప్రత్యక్షమవుతుంది. దీనిని పీడీఎఫ్ రూపంలో సేవ్ చేసుకోవడం ద్వారా విద్యార్థి ప్రగతికి సంబంధించిన పూర్తి వివరాలు పరిశీలించుకోవచ్చు.



హోలిస్టిక్ రిపోర్టు వివరాలు తెలిపే వెబ్‌సైట్

**ఉదయగిరి నియోజకవర్గంలో పాఠశాలల వివరాలు (2023-24)**

| మండలం | పాఠశాలలు | విద్యార్థుల సంఖ్య |
|---|---|---|
| దుత్తలూరు | 52 | 2,440 |
| వరికుంటపాడు | 58 | 2,539 |
| వింజమూరు | 48 | 3,246 |
| ఉదయగిరి | 60 | 3,274 |
| సీతారామపురం | 41 | 1,874 |
| కలిగిరి | 69 | 3,276 |
| జలదంకి | 59 | 3,435 |
| కొండాపురం | 66 | 3,184 |

**ఎప్పటికప్పుడు వివరాల నమోదు**

విద్యార్థులకు సంబంధించిన వివరాలను ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో పొందుపరుస్తారు. దీనివలన విద్యార్థులకు సంబంధించిన పూర్తి వివరాలు వారి తల్లిదండ్రులకు నేరుగా తెలుస్తుంది. స్టూడెంట్స్ పూర్తి వివరాలు ఈ కార్డులో ఉంటాయి.

– ఎస్.వెంగయ్య, మండల విద్యాశాఖాధికారి–2

## క్లుప్తంగా

### నేడు తిమ్మారెడ్డిపల్లిలో ఆరోగ్య సురక్ష

వరికుంటపాడు : మండలంలోని తిమ్మారెడ్డిపల్లి గ్రామంలో మంగళవారం రెండో విడత ఆరోగ్య సురక్ష కార్యక్రమం జరుగుతుందని స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు కరిష్మా, ఆయేషా సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రత్యేక వైద్యనిపుణులు పాల్గొని ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందిస్తారన్నారు. సచివాలయ పరిధిలోని ప్రజలు సురక్ష కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

### రామాపురంలో కార్డన్ సెర్చ్

వరికుంటపాడు : మండలంలోని రామాపురం బీసీ కాలనీలో ఎస్సై కె.తిరుపతయ్య ఆధ్వర్యంలో పోలీస్ సిబ్బంది సోమవారం కార్డన్ సెర్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ తిరిగి తనిఖీలు చేశారు. ధ్రువపత్రాలు లేని వాహనాలను గుర్తించారు. కొత్త వ్యక్తుల సంచారంపై ఆరా తీశారు. అనంతరం మాట్లాడుతూ ఎన్నికల కౌంటింగ్ ప్రక్రియ ముగిసే వరకు గ్రామాల్లో ప్రశాంతంగా ఉండాలన్నారు. వివాదాలు, అల్లర్లు సృష్టించేందుకు ప్రయత్నిస్తే కఠిన చర్యలు తప్పవన్నారు. పార్టీలకతీతంగా ప్రతి ఒక్కరూ ఐక్యంగా ఉండాలన్నారు.

### భూసార పరిరక్షణతోనే అధిక దిగుబడులు

బిట్రగుంట : రైతులు భూసార పరిరక్షణ చర్యలు చేపట్టడం ద్వారా అధిక దిగుబడులు సాధించడంతో పాటు పంటకు తెగుళ్లు, చీడపీడలను తట్టుకునే సామర్థ్యం కూడా లభిస్తుందని కావలి వ్యవసాయ సహాయ సంచాలకుడు సీహెచ్ నాగరాజు అన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పీఎం–ప్రణమ్ కార్యక్రమంలో భాగంగా ముంగమూరులో రైతులకు భూసార పరిరక్షణపై సోమవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కావలి ఏడీఏ నాగరాజు మాట్లాడుతూ ప్రకృతి సిద్ధమైన భూసారాన్ని పరిరక్షించడం ద్వారా తక్కువ ఖర్చుతోనే అధిక దిగుబడులు పొందవచ్చని తెలిపారు. భూసార పరిరక్షణలో కీలకమైన భూసార పరీక్షలు, నేలలో ఆమ్ల, క్షార స్థాయిలను గుర్తించడం, చౌడు భూములను సాగుకు పనికి వచ్చేలా సిద్ధం చేయడం, పచ్చిరొట్ట ద్వారా భూములను సారవంతం చేయడం, తదితర అంశాలపై అవగాహన కలిగించారు. కార్యక్రమంలో వ్యవసాయాధికారిణి విజయలక్ష్మి, రైతులు తదితరులు పాల్గొన్నారు.

### గ్రామ సచివాలయం తనిఖీ


రికార్డులు పరిశీలిస్తున్న ఎంపీడీఓ

చేజర్ల : మండలంలోని ఆదూరుపల్లి గ్రామ సచివాలయాన్ని ఎంపీడీఓ కరిముల్లా సోమవారం తనిఖీ చేశారు. హాజరు రికార్డును పరిశీలించారు. ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని సిబ్బందికి సూచించారు. సమయపాలన పాటించాలని తెలియజేశారు. అనంతరం రైతు భరోసా కేంద్రాన్ని సందర్శించారు. పంచాయతీ సెక్రటరీ ఆంజనేయులు ఉన్నారు.

### అనుమానితుల కదలికలపై నిఘా

బిట్రగుంట : బోగోలు మండలంలో సమస్యాత్మక, సున్నిత ప్రాంతాలపై పోలీసుల నిఘా కొనసాగుతోంది. కౌంటింగ్ సందర్భంగా అల్లరిమూకలు, వివాదాస్పద వ్యక్తులు అల్లర్లు సృష్టించకుండా పోలీసులు ముందస్తుగా పకడ్బందీ చర్యలు చేపడుతున్నారు. జిల్లా ఎస్పీ ఆరిఫ్ హఫీజ్ ఆదేశాల మేరకు కావలి రూరల్ సీఐ నాగభూషణం ఆధ్వర్యంలో తరచూ కార్డన్ సెర్చ్, ఆకస్మిక తనిఖీలు చేపట్టడంతో పాటు గ్రామస్థాయిలో విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. కౌంటింగ్ తేదీ దగ్గర పడుతున్న నేపథ్యంలో శాంతిభద్రతలకు విఘాతం కలిగించేందుకు అవకాశం ఉన్న అనుమానితులు, పాతనేరస్తుల కదలికలపై నిఘాను ముమ్మరం చేశారు. బిట్రగుంట పోలీసులు ఇప్పటికే కార్డన్ సెర్చ్ ద్వారా 14 వరకూ ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. ఎప్పటికప్పుడు తనిఖీలు నిర్వహిస్తూ కొత్త వ్యక్తుల వివరాలు ఆరా తీస్తున్నారు. కౌంటింగ్ సందర్భంగా, ఆ తరువాత కూడా అల్లర్లకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరిస్తున్నారు.

### జయప్రదం చేయాలి

ఉదయగిరి : స్థానిక పుచ్చలపల్లి సుందరయ్య భవన్‌లో బుధవారం జరిగే జక్కా వెంకయ్య వర్ధంతిని జయప్రదం చేయాలని సీపీఎం మండల కార్యదర్శి ఫర్దిన్‌బాషా సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. కార్యక్రమంలో సీపీఎం అనుబంధ సంఘాలు, సానుభూతిపరులు పాల్గొనాలని కోరారు.

## ‘ఫ్యామిలీ డాక్టర్’తో పేదలకు మేలు


వరికుంటపాడు : వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ ఆయేషా


వెంకన్నపాళెంలో వృద్ధురాలికి సూచనలు చేస్తున్న వైద్యాధికారిణి గీతారెడ్డి

వరికుంటపాడు : ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం ద్వారా గ్రామీణ పేద ప్రజలకు ఎంతో మేలు స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారిణి ఆయేషా పేర్కొన్నారు. మండలంలోని సాతువారిపల్లి గ్రామంలో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని ఆమె సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా 30 మందికి వైద్య పరీక్షలు చేసి మందులు అందజేశారు. మంచానికి పరిమితమైన రోగుల ఇళ్లకు వెళ్లి వైద్య పరీక్షలు చేశారు. దీర్ఘకాలిక రోగులు, గర్భిణుల ఆరోగ్యం పట్ల తగిన శ్రద్ధ వహించాలన్నారు. వైద్యుల సూచనల మేరకు మందులు వాడాలన్నారు. ప్రతినెలా వైద్య పరీక్షలు చేయించుకోవాలన్నారు. ఫ్యామిలీ డాక్టర్ సేవలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎన్‌ఎం సావిత్రి, ఎంఎల్‌హెచ్‌పీ హైమా, సిబ్బంది పాల్గొన్నారు.

**వెంకన్నపాళెంలో..**

ఉదయగిరి : కలిగిరి పంచాయతీ వెంకన్నపాళెంలో 104 వాహనం ద్వారా వైద్యాధికారి బిజ్జం గీతారెడ్డి ఫ్యామిలీ డాక్టర్ వైద్యసేవలు సోమవారం అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 104 వాహనంలో అన్నిరకాల మందులు అందుబాటులో ఉంటాయన్నారు. దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులకు బీపీ, షుగర్ పరీక్షలు నిర్వహించారు. రోగులను వైద్య పరీక్షలు జరిపి మందులను అందజేశారు.


వైద్య పరీక్షలు జరుపుతున్న వైద్యసిబ్బంది

## మంచి ఆహారం తీసుకోవాలి

చేజర్ల : చిరుధాన్యాలతో కూడిన మంచి ఆహార పదార్థాలు తీసుకోవాలని చేజర్ల పీహెచ్‌సీ వైద్యురాలు మెహతాబ్ సూచించారు. మండలంలోని టీకేపాడు ఆరోగ్య ఉప కేంద్రంలో 104 వాహనం ద్వారా సోమవారం వైద్యసేవలు నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పోషక విలువలు కలిగిన విటమిన్‌లు అధికంగా ఉండే ఆహార పదార్థాలు తీసుకోవాలన్నారు. రోగులకు బీపీ, షుగర్ పరీక్షలు చేసి ఉచితంగా మందులు అందించారు. ఇద్దరు గర్భిణులను పరీక్షించి వైద్య సలహాలు అందజేశారు. ఈ శిబిరంలో 60 మంది రోగులను పరీక్షించారు. ఈ కార్యక్రమంలో సీహెచ్‌ఓ చంద్రయ్య, ఏఎన్‌ఎం మస్తానమ్మ, ఆశా వర్కర్లు పద్మ, వరలక్ష్మి పాల్గొన్నారు.


రోగిని పరీక్షిస్తున్న వైద్యురాలు

## గొడవలకు దిగితే కఠిన చర్యలు

ఉదయగిరి : ఎన్నికల కోడ్ నేపథ్యంలో గొడవలకు దిగితే కఠిన చర్యలు తప్పవని ఉదయగిరి ఎన్నికల రిటర్నింగ్ అధికారి రాజారమేష్ ప్రేమ్‌కుమార్ తెలిపారు. మండల పరిధిలోని చోడవరంలో కావలి డీఎస్పీ వెంకటరమణ, కలిగిరి సీఐ ఫిరోజ్‌ఖాన్‌లతో కలిసి సోమవారం రాత్రి కార్డన్ సెర్చ్ నిర్వహించారు. అనంతరం గ్రామస్తులతో సమావేశం నిర్వహించారు. ఎన్నికల ఫలితాల రోజున ఎలాంటి గొడవలకు వెళ్లకుండా ప్రశాంతంగా ఉండాలన్నారు. ఎలాంటి విజయోత్సవ సంబరాలు, బాణసంచా కాల్చడం లాంటివి చేసుకోవద్దన్నారు. చోడవరంలో పోలింగ్ సమయంలో అల్లర్లు సృష్టించిన వారికి కౌన్సెలింగ్ నిర్వహించారు. కార్యక్రమంలో ఎస్సై ఆదిలక్ష్మి, తహసీల్దార్ వాసు, పోలీస్ సిబ్బంది ఉన్నారు.



## రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

సంగం : మండలంలోని దువ్వూరు వద్ద నెల్లూరు–ముంబై జాతీయ రహదారిపై బైక్ అదుపు తప్పి పడిన ఘటనలో ఇరువురు గాయపడిన ఘటన సోమవారం చోటుచేసుకుంది. స్థానికుల కథనం మేరకు.. నెల్లూరు బాలాజీనగర్‌కు చెందిన వెంకటేశ్వర్లు, ప్రకాష్ పని నిమిత్తమై బైక్‌లో ఆత్మకూరుకు వెళ్లారు. తిరిగి వస్తుండగా దువ్వూరు వద్ద బైక్ అదుపుతప్పి పడడంతో గాయపడ్డారు. స్థానికుల సహకారంతో బుచ్చిరెడ్డిపాళెంలో ప్రథమ చికిత్స అనంతరం తరలి వెళ్లారు.

**బైక్ అదుపుతప్పి..**

ఆత్మకూరు : బైక్ అదుపుతప్పి పెన్నా బ్రిడ్జి డివైడర్‌ను ఢీకొనడంతో ఓ వ్యక్తికి గాయాలైన ఘటన సోమవారం రాత్రి అప్పారావుపాళెం వద్ద చోటుచేసుకుంది. స్థానికుల వివరాల మేరకు.. ఏఎస్‌పేటకు చెందిన కోటేశ్వరరావు పనిమీద మోటార్ బైక్‌లో చేజర్లకు వెళ్లారు. తిరిగి వస్తుండగా అప్పారావుపాళెం వద్ద పెన్నా బ్రిడ్జిపై బైక్ అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొంది. ఈ ఘటనలో కోటేశ్వరరావు కాలుకు తీవ్ర గాయమైంది. స్థానికులు వెంటనే గుర్తించి క్షతగాత్రుడిని ఆటోలో ఆత్మకూరు జిల్లా ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో నెల్లూరుకు తరలించినట్లు సమాచారం. దీనిపై పోలీసు కేసు నమోదు కాలేదు.

### జక్కా వెంకయ్య వర్ధంతి సభ రేపు

ఆత్మకూరు : దివంగత జక్కా వెంకయ్య వర్ధంతి సభను బుధవారం నిర్వహించనున్నట్లు ఆత్మకూరు పట్టణ సీపీఎం కమిటీ సభ్యులు తెలిపారు. పట్టణంలోని సీపీఎం కార్యాలయంలో సోమవారం కమిటీ సభ్యులు మాట్లాడుతూ ఉదయం 10 గంటలకు పార్టీ కార్యాలయంలో వర్ధంతి సభను నిర్వహిస్తామని, పార్టీ అభిమానులు, కార్యకర్తలు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

### ఇంటర్ సప్లిమెంటరీకి 722 మంది హాజరు

ఆత్మకూరు : ఆత్మకూరు పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల, బీఎస్సార్ కళాశాలల్లో సోమవారం జరిగిన ఇంటర్మీడియట్ సప్లిమెంటరీ పరీక్షలకు 722 మంది హాజరయ్యారు. స్థానిక ప్రభుత్వ కళాశాలలో మొదటి సంవత్సరం పరీక్షకు 348 మందికి 19 మంది గైర్హాజరు కాగా, 329 మంది హాజరైనట్లు ప్రిన్సిపల్ శ్రీవాణి తెలిపారు. బీఎస్సార్ కళాశాలలో మొదటి సంవత్సరం పరీక్షలకు 217 మందికి 16 మంది గైర్హాజరు కాగా, 207 మంది హాజరైనట్లు చీఫ్ అధికారి లవకుమార్ తెలిపారు. ఈ కేంద్రంలోనే మధ్యాహ్నం జరిగిన ద్వితీయ సంవత్సరం పరీక్షకు 197 మందికి 11 మంది గైర్హాజరు కాగా, 186 మంది హాజరైనట్లు ఆయన వివరించారు.

### పుస్తక పఠనంతో మేధాశక్తి



చేజర్ల : చేజర్లలోని గ్రంథాలయంలో వేసవి శిక్షణా తరగతుల్లో భాగంగా సోమవారం విద్యార్థులతో పుస్తక పఠనం చేయించారు. ఈ సందర్భంగా లైబ్రేరియన్ కల్పన మాట్లాడుతూ పుస్తక పఠనంతో విద్యార్థుల్లో మేధాశక్తి పెరుగుతుందన్నారు.

## వైభవంగా పోలేరమ్మ జాతర


ప్రత్యేకాలంకరణలో పోలేరమ్మ


విశేష పూజలు చేస్తున్న మహిళలు

సంగం : మండలంలోని పల్లిపాళెం గ్రామంలో పోలేరమ్మ జాతర మహోత్సవం సోమవారం వైభవంగా నిర్వహించారు. ముందుగా మహిళలు పెన్నానది నుంచి కలశ నీటిని ఊరేగింపుగా పోలేరమ్మ చెట్ల వద్దకు తీసుకొచ్చి అభిషేకాలు చేశారు. అనంతరం కుంకుమార్చన కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో జరిపించారు. భక్తులు అమ్మవారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. అనంతరం ప్రత్యేకంగా అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు.

## భూసార పరిరక్షణపై అవగాహన

చేజర్ల : మండలంలోని పాడేరు, వావిలేరు గ్రామాల్లోని పొలాల్లో వ్యవసాయాధికారి శశిధర్ సోమవారం పర్యటించి భూసార పరిరక్షణపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సేంద్రియ ఎరువులతో భూసారం పెంచుకోవాలని, రసాయన ఎరువుల వాడకం తగ్గించాలన్నారు. అధికారుల సూచనలు తప్పక పాటించాలన్నారు. కార్యక్రమంలో ఏఈఓ వెంకటేశ్వర్లు, వీఏఏలు సూర్యనారాయణ, కౌసల్య పాల్గొన్నారు.

## ఆన్‌లైన్ పేమెంట్‌తో తిప్పలు

ఆత్మకూరు : ఆత్మకూరు పట్టణంలోని ఓ మద్యం దుకాణం వద్ద, చేజర్లలోని మరో మద్యం దుకాణం వద్ద ఆన్‌లైన్ పేమెంట్‌ల విషయంలో సోమవారం ఘర్షణలు చోటుచేసుకున్నాయి. ఇందులో ఓ వ్యక్తిపై సిబ్బంది దాడి చేసినట్లు సమాచారం. అధికారుల ఆదేశాల మేరకు మద్యం దుకాణాల్లో ఉదయం 11 నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఆన్‌లైన్ నగదు చెల్లింపులు జరుపుతున్నట్లు సెబ్ ఇన్‌స్పెక్టర్ రవీంద్ర తెలిపారు. మిగిలిన వేళల్లో నగదు చెల్లింపులకు విక్రయిస్తున్నట్లు తెలియజేశారు. అయితే దీనిపై అవగాహన లేకపోవడంతో వాగ్వాదాలు చోటుచేసుకుని ఉంటాయని పేర్కొన్నారు.

## అక్రమంగా కంపకర్ర నరికివేత

అనుమసముద్రంపేట : ఏఎస్‌పేట మండలంలోని పెద్దబ్బీపురం గ్రామ చెరువు కట్టపై ఉన్న కంపకర్రను టీడీపీ సర్పంచ్ అక్రమంగా నరికి అమ్ముకుంటున్నట్లు గ్రామ రైతులు సోమవారం నీటి పారుదలశాఖ, పోలీసులకు ఫిర్యాదు చేశారు. గ్రామ చెరువు కట్టపై దాదాపు రూ.లక్ష విలువ చేసే కంపకర్ర ఉంది. అయితే దీనికి నీటి పారుదల శాఖ పరిధిలో టెండర్లు వేసి అమ్మి వచ్చిన నగదుతో గ్రామ పంచాయతీకి వినియోగించాల్సి ఉంది. అయితే సర్పంచ్ ఎవరికీ తెలియకుండా కంపకర్రను కొట్టి విక్రయించి నగదును తమ ఖాతాలో జమ చేసుకుంటున్నట్లు రైతులు ఆరోపిస్తున్నారు. గతంలోనూ ఈ చెరువు కట్టపై ఉన్న కంపకర్రను దాదాపు రూ.3 లక్షలకు అమ్మినట్లు వారు తెలిపారు. జిల్లాస్థాయి అధికారులు విచారణ జరిపించాలని వారు కోరారు.


అక్రమంగా నరికిన కంపకర్ర చెట్లు

### తాగునీటి ఎద్దడి నివారణకు ప్రత్యేక చర్యలు

బిట్రగుంట : వేసవి తీవ్రత దృష్ట్యా బోగోలు మండలంలో తాగునీటి ఎద్దడి తలెత్తకుండా ప్రత్యేక చర్యలు చేపట్టాలని మండల సర్వసభ్య సమావేశంలో తీర్మానించారు. ఎంపీపీ మేకల సుజాత ఆధ్వర్యంలో స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సాధారణ సర్వసభ్య సమావేశం సోమవారం నిర్వహించారు. ఎన్నికల కోడ్ అమలులో ఉండడంతో అత్యవసర ప్రాతిపదికన తాగునీటి సమస్యపై మాత్రమే చర్చించారు. వేసవి తీవ్రత కారణంగా బోర్లు, బావులు ఎండిపోవడంతో ప్రజలు తాగునీటికి ఇబ్బందులు పడుతున్న విషయాన్ని సభ్యులు ప్రస్తావించగా వెంటనే తగిన చర్యలు చేపట్టాలని నిర్ణయించారు. అదే విధంగా పలుచోట్ల అతిసారా ప్రబలుతుండడంతో ముందస్తు జాగ్రత్తగా ఓవర్‌హెడ్ ట్యాంకులు, తాగునీటి బావుల్లో క్లోరినేషన్ చేపట్టాలని సంబంధిత అధికారులకు సూచించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యురాలు మద్దిబోయిన కీర్తన, ఎంపీడీఓ జమీవుద్దీన్, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

### సబ్సిడీపై పచ్చిరొట్ట విత్తనాలు

చేజర్ల : రాష్ట్ర ప్రభుత్వం 50 శాతం సబ్సిడీపై పచ్చిరొట్ట విత్తనాలను అందజేస్తున్నట్లు మండల వ్యవసాయాధికారి శశిధర్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. జీలుగ, జనుము కేజీ రూ.44కి, పిల్లిపెసర రూ.67కి అందిస్తున్నామన్నారు. రైతు భరోసా కేంద్రాల్లో విత్తనాలు అందుబాటులో ఉన్నాయని, ఈ అవకాశాన్ని రైతులు వినియోగించుకోవాలని కోరారు. కావల్సిన రైతులు స్థానిక ఆర్బీకేల్లో తమ పేర్లను నమోదు చేసుకోవాలని తెలియజేశారు.